


| రంజాన్ వేళలు | ఇఫ్తార్ (శక్రవారం సాయంత్రం) | సెహరీ (శనివారం ఉదయం) |
| --- | --- | --- |
| కడప | 6.31 | 5.09 |
| ప్రొద్దుటూరు | 6.32 | 5.13 |

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ముఖద్వారం




# ఇన్‌చార్జి ఎన్నాళ్లు..?

- ఆర్జీయూకేటీకి చాన్సలర్‌ను నియమించేదెపుడు
- వైసీపీ ప్రభుత్వం పోతూనే తప్పుకొన్న చాన్సలర్
- ఇన్‌చార్జి వీసీ పాలనలో యూనివర్సిటీ
- ట్రిపుల్‌ఐటీల్లో కుంటుపడుతున్న చదువులు

వేంపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు తద్వారా ఉన్నత ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటైనదే ఆర్జీయూకేటీ. అలాంటి యూనివర్సిటీ తొమ్మిది నెలలుగా ఇన్‌చార్జి పాలనలో సాగుతోంది. రాష్ట్రంలో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) 2006లో పురుడుపోసుకుని 2008లో ప్రారంభమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇడుపులపాయ, నూజివీడు, బాసరలో ట్రిపుల్ ఐటీలు ఏర్పాటుచేశారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ఎక్కువ అవకాశాలు వచ్చేలా 10వ తరగతి మార్కులకు వెయిటేజీ ఇచ్చి ప్రవేశాలు కల్పించారు. ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ కోర్సు పూర్తయ్యేలా ఈ యూనివర్సిటీ నడుస్తోంది. విడిపోయిన ఆంధ్రప్రదేశ్‌లో ఇడుపులపాయ, నూజివీడు కొనసాగగా తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలను నూతనంగా ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఆర్జీయూకేటీ పరిధిలో నాలుగు ట్రిపుల్‌ఐటీలు రాష్ట్రలో ఉండగా సుమారు 24వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.

### ఇన్‌చార్జి వీసీతో కొనసాగుతోంది

ప్రత్యేకమైన ఆర్జీయూకేటీకి ప్రారంభంలో నియామకమైన చాన్సలర్ రాజిరెడ్డి సుదీర్ఘంగా 2008 నుంచి 2019 వరకు కొనసాగారు. ఆ సమయంలోనే ట్రిపుల్‌ఐటీలకు నూజివీడులో కొత్త భవనాలు, మిగిలిన మౌలిక సదుపాయాలు సమకూరాయి. మొదట్లో షెడ్లలో ప్రారంభించిన ట్రిపుల్‌ఐటీని పూర్తిస్థాయిలో పక్కా భవనాల్లోకి తీసుకొచ్చారు. కొత్తగా ఏర్పాటైన ఒంగోలు, శ్రీకాకుళంలో నూతన భవనాల కోసం ప్రయత్నాలు చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే సుదీర్ఘ కాలం చాన్సలర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ రాజిరెడ్డి తప్పుకొన్నారు. ఆ స్థానంలో ఉన్నత విద్యాశాఖలో పనిచేస్తున్న ప్రొఫెసర్ కేసీరెడ్డి నియామకమయ్యారు. ఐదేళ్లపాటు కొనసాగిన ఆయన వైసీపీ ప్రభుత్వం ఓడిపోయి కూటమి ప్రభుత్వం రాగానే చాన్సలర్ పదవి నుంచి తప్పుకొన్నారు.

### కుంటుపడుతున్న పరిపాలన.. చదువులు

ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో ఇడుపులపాయ, నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్‌ఐటీలు నడుస్తున్నాయి. ఈ ట్రిపుల్‌ఐటీలకు చాన్సలర్ లేకపోవడం ఒక ఎత్తు అయితే గత ప్రభుత్వంలో పనిచేసిన వైస్ చాన్సలర్ హేమచంద్రారెడ్డి తప్పుకోగా ఇన్‌చార్జి వీసీగా విజయ్‌కుమార్ కొనసాగుతున్నారు. ట్రిపుల్‌ఐటీల్లో ఉన్న డైరెక్టర్లందరు ప్రభుత్వం మారుతూనే రాజీనామా చేశారు. వీరందరూ ప్రస్తుతానికి కొనసాగాలంటూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో అలాగే కొనసాగుతున్నారు. రెగ్యులర్ చాన్సలర్, వైస్ చాన్సలర్, డైరెక్టర్లు లేక నిర్ణయాలు తీసుకోవడం జాప్యం జరుగుతోంది. దీనితో పరిపాలన కుంటుపడుతోందనే విమర్శ ఉంది. ఆడికాడికే ఉన్న నిధులు జీతాలకే సరిపోవడం లేదు. ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తెప్పించే అధికారి ఆర్జీయూకేటీకి ప్రస్తుతం అత్యవసరం అనే వాదన ట్రిపుల్‌ఐటీ వర్గాల నుంచి వినిపిస్తోంది. దీనితో పాటు రెగ్యులర్ అధ్యాపకులు లేక ఉన్న కాంట్రాక్టు అధ్యాపకులకు అదనపు పాలన బాధ్యతలు ఇవ్వడంతో చదువులకు ఆటంకం కలుగుతోందన్న ప్రచారం ఉంది. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు అధ్యాపకులను నియమించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. సమస్యలపై తరచూ విద్యార్థులు ధర్నాలకు దిగుతున్నారు. వేతనాలు పెంచలేదని తాత్కాలిక అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సక్రమంగా మెస్‌లు నడవడం లేదనే ఆరోపణలూ ఉన్నాయి. ఓ ఉన్నత విద్యావేత్తను చాన్సలర్‌గా నియమిస్తే ఆర్జీయూకేటీ గాడిన పడే అవకాశం ఉంది. దీనితో వైస్ చాన్సలర్, డైరెక్టర్లు, మిగతా పరిపాలనకు సంబంధించిన పోస్టులను రెగ్యులర్‌గా నియమించుకునే వెసులుబాటు కలుగుతుంది. ఇప్పటికే తొమ్మిది నెలలు అయింది. వెంటనే ప్రభుత్వ పెద్దలు ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాశినాయన జ్యోతి క్షేత్రంలో..

# కట్టడాలను కూల్చడం దురదృష్టకరం

- అనుమతులు తీసుకుని.. నా సొంత నిధులతో కట్టిస్తా
- మంత్రి నారా లోకేశ్ హామీ


మంత్రి నారా లోకేశ్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఆలయ ప్రధాన అర్చకుడు జీరయ్యస్వామి

కడప /కాశినాయన, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలంలోని జ్యోతిక్షేత్రంలో కట్టడాలను కూల్చడం దురదృష్టకరమని మంత్రి నారా లోకేశ్ అన్నారు. వాటిని తన సొంత నిధులతో కట్టిస్తానని ఆయన హామీ ఇచ్చారు. బుధవారం రాష్ట్ర ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కేకే చౌదరి జ్యోతిక్షేత్రాన్ని సందర్శించారు. అనంతరం ఇటీవల అటవీశాఖ అధికారులు అనుమతులు లేవంటూ అక్కడ కూల్చివేసిన పలు నిర్మాణాలను పరిశీలించారు. తదుపరి జ్యోతి క్షేత్రంలో చోటుచేసుకున్న పరిస్థితులు, కట్టడాల కూల్చివేతలపై మంత్రి నారా లోకేశ్‌కు ఫోన్‌లో వివరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీరయ్య స్వామిని నారా లోకేశ్‌తో మాట్లాడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జరిగిన సంఘటన దురదృష్టకరమని ఇది ఎంతో తొందరపాటు చర్య అన్నారు. కట్టడాల కూల్చివేతపై ప్రభుత్వం తరపున తాను క్షమాపణ చెబుతున్నా అన్నారు. కూల్చివేతకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకుంటామని, త్వరలోనే అటవీశాఖ అనుమతులు తీసుకుని తన సొంతనిధులతో అన్నదాన భవనాలు నిర్మిస్తామని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. సాధ్యమైనంత తొందరగా బస్సు సౌకర్యం పునరుద్ధరిస్తామని అన్నారు. ఈ మేరకు ట్విట్టర్‌లో కూడా వెల్లడించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేకే చౌదరి మాట్లాడుతూ దీనిపై భక్తులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్ని అనుమతులతో ఆశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని అన్నారు. కొంతమంది నాయకులు దీనికి రాజకీయ రంగు పులిమి కూటమి ప్రభుత్వంపై నిందారోపణలు చేయడం సమంజసం కాదన్నారు. గత 5సంవత్సరాలు కడప జిల్లాకు చెందిన వ్యక్తే ముఖ్యమంత్రిగా ఉన్నారని ఎంపీగాని స్థానిక ఎమ్మెల్యేగాని ఈ సమస్యను ఎందుకు సరిష్కరించలేదో ప్రజలకు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రమోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు రాజారెడ్డి, నేతలు గురివిరెడ్డి, బి.రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

- వైసీపీ శ్రేణుల డిమాండ్


యువతపోరులో భాగంగా కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న వైసీపీ నేతలు

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఫీజు రీయిర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు వెంటనే చెల్లించాలని వైసీపీ శ్రేణులు డిమాండ్ చేశాయి. బుధవారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా పార్టీ జెండాను జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, నగర అధ్యక్షుడు మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేశ్‌బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. వైసీపీ తలపెట్టిన 'యువత పోరు'లో భాగంగా జిల్లా కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. వినతి పత్రం సమర్పించాలని కలెక్టరేట్ కార్యాలయంలోకి వెళ్లగా అధికారులు అందుబాటులో లేకపోవడంతో వారు మండిపడ్డారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 2018-2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం బకాయిలు పెట్టి పోయిన రూ.1,800 కోట్లను వైసీపీ ప్రభుత్వం చెల్లించిందన్నారు. అదేవిధంగా 2023-24 ఎన్నికల కోడ్ కారణంగా ఏర్పడిన బకాయిలు చెల్లించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానికి ఉందన్నారు. ఆ బకాయిలతో కలిపి ఇప్పటి వరకు రూ.3,900కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబుపైన 420 కేసు నమోదు చేయాలని తెలిపారు. కాగా.. యువత పోరులో భాగంగా కడప కలెక్టరేట్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్న వైసీపీ శ్రేణులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, వైసీపీ శ్రేణులకు మధ్య కొంత తోపులాట జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సతీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘురామరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పదవ తరగతి పరీక్షలు

- పరీక్షాకేంద్రంలోకి సెల్‌ఫోన్లు నిషేధం : కలెక్టర్

కడప కలెక్టరేట్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పదవతరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ పదవ తరగతి పరీక్షలు, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర తదితర అంశాలపై కలెక్టర్లు, పోలీసు, విద్యాశాఖాధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జేసీ అదితిసింగ్, ఎస్పీ అశోక్ కుమార్, విద్యాశాఖాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ పదవ తరగతి ప్రశ్నపత్రాల తరలింపుపై జిల్లా స్థాయిలో పోలీసు సూపరింటెండెంట్లు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఇంటర్నెట్, జిరాక్సు కేంద్రాలను మూసివేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో 0866297454 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ 17వ తేదీ నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తుతో పాటు 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు, ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులతో పాటు అధికారులు, ఇన్విజిలేటర్లు కూడా సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదన్నారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ రకాల పథకాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలన్నారు. అనంతరం పీ-4 సర్వే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు హజరత్తయ్య, షంషుద్దీన్, రాజ్యలక్ష్మి, ఓబులమ్మ, ఆనంద్ నాయక్, కిరణ్‌కుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్, ఎస్పీ అశోక్‌కుమార్



గంజాయి సేవించే వారిపై..

# డ్రోన్ కెమెరాలతో నిఘా

కడప క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు కడప నగరం శివారులో గంజాయి సేవనం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా పెట్టారు. అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడంతో పాటు గంజాయి సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు. బుధవారం నగరంలోని గుర్రాలగడ్డ, అల్మాస్‌పేట బ్రిడ్జి, బుగ్గవంక పరిసర ప్రాంతం, ఏఎస్‌ఆర్ నగర్ పరిసర ప్రాంతాలు, పులివెందుల రోడ్డులోని కృష్ణాపురం సర్కిల్ పరిసరాల్లో డ్రోన్ కెమెరాలతో పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులను క్షుణ్ణంగా విచారిస్తున్నారు. ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.


డ్రోన్ కెమెరాలతో పరిశీలిస్తున్న దృశ్యం

'మీసేవ' అయోమయం 6

250 బస్తాల చౌక బియ్యం స్వాధీనం 7

వన్యమృగాల వేటగాళ్లపై వేటు
- 14 రోజుల రిమాండ్
7

13 జిల్లాల్లో అగ్నివీర్ నియామకాలకు నోటిఫికేషన్ 7

# మొల్ల ఆనవాళ్లకు చెదలు

- శిథిలావస్థకు ఆమె నివసించిన ఇల్లు
- తేట తెలుగులో రామాయణం రాసిన తొలి మహిళ
- నేడు కవయిత్రి మొల్ల జయంతి



గోపవరంలో మొల్ల విగ్రహం, గోపవరంలో మొల్ల నివసించిన ఇల్లు

గోపవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి రచించిన సంస్కృత రామాయణానికి తెలుగు భాషలో వన్నెలద్ది తన పేరుతో రామాయణాన్ని రచించిన కవయిత్రి మొల్లది మన జిల్లానే. తెలుగు జాతికి ఖ్యాతి తెచ్చిన బద్వేలు సమీపంలోని గోపవరంలోని ఆమె ఇల్లు నిరాదరణకు గురవుతోంది. చారిత్రక ప్రాధాన్యమున్న ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం, పురావస్తు, పర్యాటకశాఖ పట్టించుకోవడం లేదు. వాల్మీకి 24వేల శ్లోకాలతో సంస్కృత భాషలో రామాయణాన్ని రచిస్తే మొల్ల తేట తెలుగులో 871 గద్య పద్యాలతో స్వేచ్ఛానువాదంతో కావ్యంగా రచించి చెరగని ముద్ర వేసింది. 16వ శతాబ్దానికి చెందిన మొల్ల జయంతిని చరిత్రకారులు మార్చి 13వ తేదీగా నిర్ధారించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం గురువారం మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించనుంది.


మొల్ల కూర్చొని రామాయణం రాసిన అరుగు శిథిలావస్థలో వున్న దృశ్యం

### శిథిలావస్థలో..

ఆమె కూర్చుని రామాయణం రాసిన బండ శిథిలావస్థలో ఉంది. ఈమె ఆరాధ్య దైవమైన శ్రీకంఠ మల్లేశ్వరాలయం నేలచదరమైంది. రామాలయం శిథిల స్థితిలో ఉంది. శివకేశవ భేదమున్న ఆ రోజుల్లో దేవుడు ఒక్కడే అని చాటిన ధైర్యవంతురాలు కవయిత్రి మొల్ల. స్త్రీలకు విద్య, స్వాతంత్ర్యం, స్వేచ్ఛ లేని రోజుల్లో.. పురుషులు, అగ్రవర్ణాల ఆధీనంలో కవిత్వం ఉన్న కాలంలో ఆనాటి పరిస్థితులను ఆటంకాలను నిరసనలను అవమానాలను ఎదుర్కొని సరళమైన తెలుగులో మొల్ల రామాయణం రచించి తెలుగు జాతికి మహత్తరమైన కానుకగా అందించింది. ఆమె శ్రామిక కులానికి చెందిన మహిళ. సాహిత్య చరిత్రలో కవయిత్రి మొల్ల ప్రవేశం నిజంగానే విప్లవాత్మకమైనది. పైగా ఆమె రామాయణం రాయడం మరీ విప్లవం. అంతటి గొప్ప వ్యక్తి నివసించిన ఇంటిని, ఆమె గుర్తులను పట్టించుకోకపోవడం పట్ల సాహితీ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా.. విద్వాన్ గానుగపెంట హనుమంత రావు 2004లో 'మొల్లమాంబ సాహిత్య పీఠం' ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా సాహిత్య సదస్సులు నిర్వహించి గోపవరం, కడపలలో మొల్ల విగ్రహాలు ఏర్పాటు చేశారు. మన జిల్లాలో లభ్యమైన మొల్ల రాయాయణ తాళ పత్ర గ్రంథాన్ని బ్రౌన్ లైబ్రరీలో భద్రపరిచారు. గోపవరం మండలానికి మొల్లపేరు పెట్టాలని, ఆమె పూజించిన రామాలయం, శ్రీకంఠమల్లేశ్వరాలయాలను పునర్నిర్మాణం చేయాలని, జిల్లా కేంద్రమైన కడపలో మొల్ల తెలుగు సంస్కృతి అకాడమీ ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు.

# 'మీ-సేవ' అయోమయం!

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరించిన మీ-సేవా కేంద్రాల పునరుద్ధరణపై నిర్వాహకుల ఆశలు సన్నగిల్లుతున్నాయి. తాము అధికారంలోకి రాగానే మీ సేవ కేంద్రాలను ఆదుకుంటామని యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ ప్రకటించడంతో కొంత ఉపశమనం పొందారు. అయితే,వాట్సాప్ గవర్నెన్స్‌పేరుతో ఇటీవల చంద్రబాబు చేసిన ప్రకటన వారిని అయోమయంలోకి నెట్టింది.



- సచివాలయ వ్యవస్థతో నడ్డివిరిచిన జగన్
- రోడ్డునపడ్డ వేలాది కుటుంబాలు
- అమలుకు నోచుకోని నారా లోకేశ్ హామీ
- వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభంతో ఆందోళన

బి.కొత్తకోట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేంత వరకు ఓ వెలుగు వెలిగిన మీ-సేవాకేంద్రాలకు జగన్ రూపంలో ఉపద్రవం వచ్చిపడింది. మీ- సేవ కేంద్రాలు అందించే సర్వీసులను సచివాలయాల ద్వారా ఉచితంగా అందజేస్తామంటూ మొదలుపెట్టి, నాలుగు రోజులు గడవకనే రుసుం వసూలు ప్రారంభించారు. మీ-సేవ కేంద్రాల ద్వారా తీసుకున్న సర్టిఫికెట్లు చెల్లవంటూ వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ప్రచారం చేయించారు. దీంతో జనం మీ-సేవ కేంద్రాలకు వెళ్లడం దాదాపుగా మానేశారు. దీంతో నిర్వహణ ఖర్చులు భరించలేక చాలా మంది మీ-సేవ కేంద్రాలను మూసివేయగా, కొందరు మంచిరోజులు మళ్లీ వస్తాయనే ఆశతో నెట్టుకొస్తున్నారు.

**రోడ్డునపడ్డ కుటుంబాలు..**

రాష్ట్రంలో 2019కి ముందు 11 వేలకు పైగా మీ-సేవ కేంద్రాలుండేవి. వీటి ద్వారా రెవెన్యూ, ఎస్పీడీసీఎల్, హెల్త్, పోలీస్, రిజిస్ట్రేషన్, ఎండోమెంట్ తదితర 36 శాఖలకు చెందిన 329 సర్వీసులు ప్రజలకు సకాలంలో అందేవి. ప్రభుత్వం నిర్దేశించిన రుసుములో కొంతభాగం కమిషన్ రూపంలో వీరికి దక్కేది. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ఒక్కొక్క టిగా ఈ కేంద్రాలు మూతపడ్డాయి. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి.



మీ సేవ నిర్వాహకుల ధర్నాకు సంఘీభావం తెలుపుతున్న నారాలోకేశ్ (ఫైల్‌ఫోటో)

**వాట్సాప్ గవర్నెన్స్ ప్రకటనతో అయోమయం..**

మీ-సేవ కేంద్రాల నిర్వాహకులు విజయవాడలో చేస్తున్న ఆందోళనకు అప్పటి రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెంనాయుడుతో కలిసి నారాలోకేశ్ సంఘీభావం తెలపడమే కాకుండా, అధికారంలోకి రాగానే మీ సేవ కేంద్రాలకు ప్రాణం పోస్తానని యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చారు. డేట్ కూడా రాసిపెట్టుకోండని గట్టిగానే చెప్పారు. అయితే, ఇటీవల ముఖ్యమంత్రి వాట్సాప్ గవర్నెన్స్ ప్రకటనతో మీ-సేవ నిర్వాహకుల గుండెల్లో రాయి పడింది. దాని విధివిధానాలు పూర్తిగా ఖరారు కాకపోయినా, తమ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు.

**'మీ-సేవ'ను ఆదుకోవాలి..**

మీ-సేవ కేంద్రాలను ప్రభుత్వం ఆదుకోవాలి. లోకేశ్‌బాబు హామీని నిలుపుకోవా లి. రూము అద్దె, కరెంటు బిల్లు, స్టేషనరీ ఖర్చులు చేతినుంచి వేసుకొని కేంద్రాలు నడుపుతు న్నాము. గ్రామీణ ప్రాంతాలలో పరిస్థితి మరీ దారుణంగా వుంది. ఇప్పటికే చాలా వరకు మూతపడ్డాయి. మమ్మల్ని ఆదుకోండి.

- రాజేష్ , బి.కొత్తకోట

# ఆలయాల సంరక్షణ అత్యంత ఆవశ్యకం

● పుష్పగిరి మహాసంస్థాన పీఠాధిపతి జగద్గురు విద్యాశంకర భారతీ స్వామి

మదనపల్లె అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి):భారతదేశంలో ఆలయాలను కాపాడాల్సిన ఆవశ్యకత, అవసరం ఎంతైనా ఉందని పుష్పగిరి మహాసంస్థాన పీఠాధిపతి జగద్గురు విద్యాశంకర భారతీ స్వామి అన్నారు. బుధవారం మదనపల్లె మండలం, చిప్పిలి గ్రామం, చిట్టి అన్నవరంలోని సత్యనారాయణస్వామి ఆలయంలో సత్యదేవ సదన్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ భారతదేశంలో ఆధ్యాత్మిక చింతన తగ్గిపోతోందని, దీని పునరుద్ధరణకు ఆలయాల ఆలయాల సంరక్షణ అత్యవసరమన్నారు. ఆలయంలో నిర్వహించిన హోమాలు, అర్చనల్లో ఆయన పాల్గొన్నారు. సత్యదేవ సదన్‌లో అన్ని గదులు తిరిగి కర్పూరహారతులు అందించి, పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడికి విచ్చేసిన భక్తులకు సందేశం ఇచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన వితరణ చేశారు. అంతకుముందే ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.


సత్యదేవ సదన్‌ను ప్రారంభిస్తున్న పుష్పగిరి పీఠాధిపతి విద్యా శంకర భారతీ స్వామి

కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు ఎ.అమరనాథ్, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి దివాకర్, కో ఆర్డినేటర్ శివశంకర్, జ్ఞానోదయ కామకోటి ప్రసాదరావు, రమణరావు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆటోనగర్ వివాదం పరిష్కరించండి

● ఏపీఐఐసీ ఎండీని కోరిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా

మదనపల్లె టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ స్థల వివాదం పరిష్కరించాలని ఏపీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ అభిషిక్త్ కిశోర్‌ను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కోరారు. బుధవారం విజయవాడలో ఏపీఐఐసీ కార్యాలయంలో ఎండీతో మాట్లాడుతూ ఆటోనగర్ లేక పోవ డంతో 20 ఏళ్లుగా మదనపల్లె ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తొ మ్మిదేళ కిందట వలసపల్లె వద్ద ఆటోనగర్‌కు స్థలం సేకరించినా, స్థల విషయం పై కొందరు కోర్టులో కేసు వేశారన్నా రు. తగిన రీతిలో నష్టపరిహారం ఇప్పిస్తే, రైతులు కేసు వాపసు తీసుకుంటారని, వివాదం సమసిపోతుందన్నారు. సమస్య పరిష్కారానికి ఏపీఐఐసీ ఎండీ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట యుగంధర్, గురుమూర్తి, సీతక్క తదితర రైతులు పాల్గొన్నారు.


ఏపీఐఐసీ ఎండీతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రైతులు

## ఆస్తి పన్ను మినహాయింపు అమలు చేయాలని ఆందోళన

మదనపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన ఆస్తి పన్ను, నీటి పన్ను మినహాయింపును అమలు చేయాలంటూ మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో మాజీ సైనికులు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీసైనికులకు పూర్తిస్థాయిలో ఆస్తిపన్ను, వాటర్ ట్యాక్సులో 20 శాతం మినహాయిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. ఈ జీవోను అమలు చేయకపోగా, బకాయిలు చెల్లిస్తేనే, తర్వాత అమలు చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కొత్తగా ఇల్లు నిర్మించిన, కొనుగోలు చేసిన వారి విషయంలో వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, మున్సిపాలిటీకి, అక్కడి నుంచి ఉన్నతాధికారులకు పంపడంలో జాప్యం చేయడం, తదితర కారణాలతో సమస్యలు వస్తున్నాయని, వీటిని పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, ఆర్‌ఓ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఇందులో పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మాజీసైనికులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ బస్సులు ఢీ : కండక్టర్ మృతి


గంగాధర్‌బాబు (ఫైల్‌ఫోటో)

మదనపల్లె అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు లోని రాయల్పాడు సమీపంలో మంగళవారం సువర్ణముఖి ప్రైవేట్ బస్సును బెంగళూరుకు వెళుతున్న ఏఆర్ అండ్ బీఆర్ ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో మదనపల్లెకు చెందిన కండక్టర్ గంగాధర్ బాబు(58) మృతి చెందారు. సుమారు 40 మంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రుల్లో కొం దరిని మదనపల్లెలోని ప్రభు త్వ ఆస్పత్రికి తరలించగా మరికొంతమంది కర్ణాటకలోని చింతామణి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ పోషకుడు మృతి చెందడంతో రోడ్డున పడ్డామని గంగాధర్‌బాబు భార్య మంజుల, కూ తుళ్లు అనూషా, శైలజ విలపించారు. రాయల్పాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కువైత్‌లో కోడూరు వాసి ఆత్మహత్య


శ్రీనివాసులు (ఫైల్ ఫొటో)

రైల్వేకోడూరు రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రంగనాయకులపేటకు చెందిన కొల్ల శ్రీనివాసులు(38) కువైత్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. శ్రీనివాసులుకు నాలుగేళ్లు కువైత్‌లో ఉండి ఇటీవలే ఇంటికి వచ్చాడు. ఆర్థిక సమస్యలు ఎక్కువ కావడంతో ఇల్లు విక్రయించి, భార్య అన్నపూర్ణతో కలిసి మూడు నెలల క్రితం మళ్లీ కువైత్‌కు వెళ్లారు. అయినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కువైత్‌లోని తన గదిలో ఉరివేసుకుని మృతి చెందినట్లు భార్య అన్నపూర్ణ సమాచారం అందించిందని బంధువులు తెలిపారు. శ్రీనివాసులు కుమారులు బాలాజీ, రామ్‌చరణ్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతూ అతని తల్లి పార్వతమ్మ సంరక్షణలో ఉన్నారు

## ఆర్టీసీ బస్సులో కిలేడీలు

● మహిళ పర్సులోని బంగారు నగల అపహరణ

రాజంపేట టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జమ్మలమడుగు నుంచి తిరుపతికి వెళ్లే ఆర్టీసీ బస్సులో నలుగురు కిలాడీలు ఓ మహిళకు చెందిన బంగారు నగలను అపహరించారు. నందలూరు మండలం కుంపినీపురం బలిజపల్లెకు చెందిన చిన్నం సరస్వతి తన మనవడికి తిరుమలలో పుట్టువెంట్రుకలు తీయించేందుకు బుధవారం ఇంటిలో ఉన్న బంగారాన్ని హ్యాండ్‌బ్యాగులో ఉంచుకుని, అదే గ్రామానికి చెందిన గణపతి శారద అనే మహిళతో కలసి నందలూరు బస్టాండ్‌కు చేరుకుంది. బస్టాండులోని దుకాణం వద్ద బ్యాగును తెరవడం, బంగారు నగలను పక్కకు తీసి డబ్బు ఇవ్వడం బస్టాండులో ఉన్న నలుగురు మహిళలు గమనించారు. జమ్మలమడుగు - తిరుపతి బస్సులో ఎక్కిన సరస్వతి, శారదలను అను సరించారు. టిక్కెట్ కొనుగోలుకు పర్సు తెరచిన సమయంలో ఒక రు ఆమె సాయం చేస్తున్నట్లు నటించగా, మిగతా ముగ్గురు ఆమెపై పడి పోయారు. ఆ సమయంలో చాకచక్యంగా పర్సులో ఉన్న బం గారు నగలు దొంగలించారు. బోయనపలె రాగానే బస్సు దిగి వెళ్లిపోయారు. అనంతరం పర్సు గమనించిన సరస్వతి బస్సు డ్రైవర్, కండక్టర్లకు విషయం తెలపడంతో మన్నూరు పోలీసుస్టేషన్ వద్ద బస్సు ఆపి స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ మహ్మద్‌అలీ నలుగురు కిలాడీ లేడీలను పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు.

## గుట్టలో దొరికిన చిన్నారి రాయచోటికి తరలింపు


బిడ్డను అప్పగిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ములకలచెరువు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గుట్టలో దొరికిన చిన్నారిని ఐసీడీఎస్ అధికారులు మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. స్థానిక ఉమాశంకర్ కాలనీ సమీపంలోని జనసంచారం లేని గుట్టలో చిన్నారిని సుమియా అనే మహిళ అక్కున చేర్చుకున్న విష యం విదితమే. కలెక్టర్ ఆదేశాల మేరకు చిన్నారిని పోలీసుల పర్యవేక్షణ మధ్య ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి పరీక్షలు చేయించారు. అనంతరం రాయచోటి శిశు సంరక్షణ కేంద్రంలో అప్పగించారు.

## హత్య కేసులో నిందితుల అరెస్టు

సంబేపల్లె, మార్చి12(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు పనులకోసమే వారాది అనే వ్యక్తిని హత్య చేసినట్లు రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. మార్చి రెండున ముద్దినేనివాండ్లపల్లె సమీపంలోని మల్లూరమ్మ గుడి వద్ద సిమెంటుకు కాపలా కాస్తున్న వారాది అనే వ్యక్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. కల్వర్టు నిర్మాణం కాంట్రాక్టు పని తనకు వచ్చిందని, సిమెంటు రోడ్డు పనులు కూడా తానే చేస్తానని వారాది గ్రామంలో చెబుతుండడంతో జీర్ణించుకోలేక బెల్లం యోగానందరెడ్డి అనే వ్యక్తి చిన్నికృష్ణ సాయంతో సిమెంటుకు కాపలా కాస్తూ నిద్రపోతున్న వారాదిపై బండరాయితో దాడి చేసి చంపినట్లు తెలిపారు.

# అవినీతి కేసులో 'రిజిస్ట్రేషన్' సిబ్బంది ఇంక్రిమెంట్లలో కోత

కలికిరి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కడప అర్బన్ సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో 2019లో పనిచేసిన ఏడుగురు సిబ్బందికి క్యుములేటివ్ ప్రాతిపదికన మూడేసి ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. 2017 జూలై 12న అర్బన్ సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు దండు వెంకట సుబ్బా రెడ్డి, ఆవుల రంగనాథబాబు, స్టాంపుల డిపో జూనియర్ అసిస్టెంట్లు ఎనమల వెంకట్రమణ, కడిమెల్ల రెడ్డెయ్యరాజు, షరాఫ్ షేక్ మస్తాన్‌వలీ, ఆఫీస్ సబార్డినేట్‌లు కోకల శ్రీనివాసులు, కోలా సుబ్బలక్ష్మమ్మ వద్ద అవినీతికి సంబంధించిన ఆధారాలు లభించడంతో ఏడుగురిపైన కేసు నమోదు చేశారు. దీనిపై సంజాయిషీ నోటీసులు జారీ చేసి పలుమార్లు విచారణ చేసిన అనంతరం, ఈ వ్యవహారాన్ని కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్‌కు అప్పగించారు. ఏడుగురినీ కలిపి ఒకే కేసుగా పరిగణించి కేసును కొనసాగించారు. రిటైర్డు ఐఏఎస్ అధికారి ఆర్.పి. ఠాకూర్ ఆధ్వర్యంలో ఏర్పడిన విచారణ కమిషను కేసును కూలంకషంగా విచారించి అందరినీ దోషులుగా నిర్ధారించింది. ఆధారాలతో సహా కేసు నిరూపణ జరిగింది. చివరగా ఏడుగురి నుంచి కడప స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల డీఐజీ చివరి సంజాయిషీలు తీసుకుని ఈ నెల 2న ప్రభుత్వానికి అందజేశారు. పూర్వాపరాలను పరిశీలించిన ప్రభుత్వం ఏడుగురికీ క్యుములేటివ్ పద్ధతిలో మూడేసి ఇంక్రిమెంట్లు కోత విధించింది. ఆ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్పీ శిశోడియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# కంది రైతులు సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలి

రామాపురం, మార్చి12(ఆంధ్రజ్యోతి): కంది పండించిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలంటే సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ తెలిపారు. మండలంలోని చిట్లూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి మార్కెట్ యార్డులోని కందులు కొనుగోలు కేంద్రంలో కందులు క్వింటాల్ ధర రూ.7,550 కనీస మద్దతు ధర ఇస్తారని రైతులకు తెలియజేశారు. సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు మాత్రమే వ్యవసాయ అనుబంధ శాఖల నుండి లభించే పథకాలకు అర్హులని తెలిపారు. వేరుశనగలో జిప్సం ప్రయోజనాలను రైతులకు వివరించారు. వ్యవసాయ యాంత్రీకరణ పంటల బీమా ప్రయోజనాలు వివరించారు. రబీ సీజన్‌లో పంట నమోదు చేసిన పంట వివరాలపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 19 లోపు రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి తెలియజేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి వై. నాగమణి, ఏఈవో ప్రసంజిని, వీహెచ్‌ఏ యాసిన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

# సమగ్ర యాజమాన్యంతో పూత, పిందెకు రక్షణ

పీలేరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులతో మామిడి పూత, పిందెను కాపాడుకోవచ్చని కలికిరి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సమీకృత ఉద్యాన మిషన్‌లో భాగంగా బుధవారం పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ కోళ్లపారం, బాలంవారిపల్లె పంచాయతీ నాలేవాండ్లపల్లెల్లో మామిడి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పిందె, పూతను తేనె మంచు పురుగు, తామర పురుగు, ఆంత్రాక్నోస్ తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. వాటి నివారణకు బుప్రోఫుజిన్ 20%, అసిఫేట్ 50%, ఫైమెట్రోజన్, సాఫ్, థయోఫినైట్ మిథైల్ తగు మోతాదుల్లో వాడాలన్నారు. పిందెలు రాలుతున్నట్లు అనిపిస్తే ప్లానోఫిక్స్ అనే మందును 4.5 లీటర్ల నీటికి 1 మిల్లీలీటరు కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులందరూ ఫ్రూట్ కవర్లు కట్టుకోవాలని సూచించారు. కాయలు నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఫ్రూట్ కవర్లు కట్టడం వల్ల పండు ఈగ, మసి మంగు నుంచి కాయకు రక్షణ ఉంటుందన్నారు. కవర్లు కట్టిన కాయలన్నీ ఒకే సైజులో, మంచి నాణ్యతతో ఉంటాయన్నారు. దూర ప్రాంతాలకు రవాణా చేస్తున్నప్పుడు కాయలు త్వరగా చెడిపోకుండా ఉంటాయన్నారు. అధిక గాలి వచ్చినప్పుడు కాయలు రాలకుండా కవర్లు రక్షణ కల్పిస్తాయని, ఎటువంటి రసాయన అవశేషాలు లేనందు వల్ల కవర్లు కట్టిన కాయలకు మంచి ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓ సుకుమార్ రెడ్డి, ఏఓ రమదేవి, రైతులు రమణ, షౌకత్‌అలీ, సురేంద్రనాథరెడ్డి, ఏఈవోలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.


కాకులారంపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

## సీనియర్ అసిస్టెంట్లకు డీటీలుగా పదోన్నతి

● మూడు జిల్లాల్లో 19మందికి అవకాశం

మదనపల్లె, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 19 మంది సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ తహసీల్దార్లుగా పదోన్నతి కల్పిస్తూ చిత్తూరు జిల్లా కలెక్టర్, నోడల్ ఆఫీసర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలోని మండలాలు, జిల్లా కేంద్రాల్లో సీనియర్ అసిస్టెంట్లు, క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులుగా పని చేస్తున్నారు. పదోన్నతి పొందిన వారిలో కె.మాధవి(తిరుపతి కలెక్టరేట్), డి.రాజశేఖర్(చిత్తూరు కలెక్టరేట్), టి.బాలాజీ(పెద్దతిప్పసముద్రం), ఆర్.మోహన్(చిత్తూరు డీఎస్‌వో కార్యాలయం), పి.చాణక్య(అన్నమయ్య డీఎస్‌వో కార్యాలయం), బి.నందినీదేవి(పలమనేరు), వి.రేఖ(చిత్తూరు కలెక్టరేట్), జి.కృష్ణమ్మ(ఆర్.సి.పురం), జి.మస్తాన్‌కమలాకర్(అన్నమయ్య కలెక్టరేట్), ఎస్.అనీష(ములకలచెరువు), బి.జోసెఫ్(చిత్తూరు కలెక్టరేట్), ఎం.శిరీష(చిత్తూరు డీఎస్‌వో కార్యాలయం), బి.సుధాకర్‌నాయక్(రొంపిచెర్ల), బి.భాస్కర్(చంద్రగిరి), ఎం.నరేంద్ర(గంగవరం), పి.శోభ(చిత్తూరు కలెక్టరేట్), బి.నాగరాజు(తొట్టంబేడు), ఆర్.మధుసూదన్(బంగారుపాళెం), జి.యోగేష్(చిత్తూరుకలెక్టరేట్)ఉన్నారు. వీరికి జిల్లాలు కేటాయించిన అనంతరం ఆయా జిల్లాల కలెక్టర్లు.. కేంద్రాలు, మండలాల వారీగా పోస్టింగ్ ఇవ్వనున్నారు.

## మార్కెట్ వేలం వాయిదా

కమలాపురం రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ పరిధిలో బుధవారం నిర్వహించిన దినసరి మార్కెట్ , బస్టాండు, జంతు వధశాలల్లో రుసుము వసూలు హక్కుల వేలంలో ఎవరూ పాల్గొనక పోవడంతో వాయిదా వేసినట్లు నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. ఈ వేలంను 18వ తేదీకి వాయిదా వేసినట్లు ఆయన వివరించారు.

# కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులకు భరోసా..

● టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని
● మెగా జాబ్‌మేళాకు తరలివచ్చిన నిరుద్యోగులు

రైల్వేకోడూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మెగా జాబ్ మేళానిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలసినప్పుడు రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎక్కువ మంది ఉద్యోగాలు లేక, గల్ఫ్ కు వెళుతున్నారని వివరించడంతో ఆయన స్పందించి అమరరాజా, మోటరోలా, అపోలో సంస్థల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించ వచ్చునని తెలపడంతో ఆయా సంస్థలతో కలసి మాట్లాడి మెగా జాబ్ మేళా నిర్వహించామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవనకళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగార్జునరావు, తెలుగు యువత సీనియర్ నాయకుడు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, మల్లెం హేమంత్, చాపలమడుగు సూర్యప్రకాష్ చౌదరి, కస్తూరి దినేష్, వివిధ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగాలు దక్కించుకున్న యువతతో పంతగాని, ఆయా సంస్థల ప్రతినిధులు

# మహిళపై చిత్రహింసలు..నలుగురిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మహిళను చిత్రహింసలకు గురిచేసిన ఆమె భర్తతోపాటు, మరో ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని ముష్టూరు పంచాయతీకి చెందిన టి. సంఘవికి పదేళ్ల క్రితం కలికిరి మండలం గుట్టపాలెంకు చెందిన వెంకటరమణతో వివాహం జరిగింది. అయితే వీరికి ఇద్దరు కుమారులు. కాగా వెంకటరమణ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని సంఘవిని చిత్రహింసలకు గురిచేసేవాడు. అతని తల్లి రమణమ్మ(51),చెల్లి శివమ్మ(38) తమ్ముడు మనోహర(32) కూడా చిత్రహింసలు పెట్టేవారు, ఈ విషయంలో గతంలో కూడా కలికిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, రాజీ కుదిర్చినట్లు తెలిపారు. అయినా వారు మారకపోవడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మార్కెట్ సెస్సు వేలంతో అంగళ్లు పంచాయతీకి రూ.1.05 కోట్ల ఆదాయం

కురబలకోట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు టమోటా మార్కెట్, గొర్రెలు, వారపు సంతల్లో సెస్సు వసూలు హక్కులకు నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయి ఆదాయం దక్కింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం టమోటా మార్కెట్, గొర్రెలు, వారపు సంతలకు వేలం నిర్వహించగా, అంగళ్లకు చెందిన పోరెడ్డి శ్రీనివాసులరెడ్డి. టమోటా మార్కెట్‌ను రూ.45.40 లక్షలకు, మదనపల్లెకు చెందిన సత్తార్‌ఖాన్ గొర్రెల సంతను రూ.52.10 లక్షలకు, యు.శ్రీనివాసులు వారపు సంతను రూ.7.70 లక్షలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోరెడ్డి విశ్వనాథరెడ్డి, డీఎల్‌డీవో నాగరాజ, ఎంపీడీవో గంగయ్య,ఈవోపీఆర్‌డీ అశ్విని, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్‌లు తదితరులు పాల్గొన్నారు.

## హార్సిలీహిల్స్‌లోని గదుల వేలానికి దేవదాయశాఖ అధికారుల కసరత్తు

బి.కొత్తకోట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో ఉన్న దేవదాయశాఖ ఆధ్వర్యంలో గదుల వేలానికి సాధ్యాసాధ్యాలను జిల్లా దేవదాయ శాఖ అధికారులు బుధవారం అధ్యయనం చేశారు. కొండ మీద అతిపురాతనమైన ఏనుగుమల్లమ్మ ఆలయం వుంది. కోటావూరు పంచాయతీ పరిధిలోని పలుగ్రామాల ప్రజలు ప్రతియేటా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ ఆలయం ముందుభాగంలో ఉన్న గదులను బహిరంగ వేలం ఎందుకు వేయలేదంటూ దేవదాయశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్ అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్‌కు మెమో ఇచ్చారు. దీంతో ఆయన జిల్లా టూరిజం అధికారి నాగభూషణంతో కలిసి బుధవారం హార్సిలీహిల్స్‌కు చేరుకొని వేలం వేయదలచిన గదులను పరిశీలించారు. ఏనుగు మల్లమ్మ ఆలయానికి చట్టబద్ధంగా 0.40 ఎకరాల భూమి మాత్రమే వుందని, ప్రస్తుతానికి టూరిజం అధికారుల సహ కారంతో గదులను వాడుకోవడంతో పాటు, వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నామని ఆలయ ధర్మకర్త రాజేంద్రనాథ్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి ఎండోమెంట్ అధికారులకు వివరించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని, తదుపరి ఆదేశాల మేరకు కార్యాచరణ ఉంటుందని ఎండోమెంట్ అధికారి విశ్వనాథ్ తెలిపారు.

# భూఆధార్

వ్యవసాయ రంగంలో అన్నదాతల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. ఈ పథకాలు అర్హులకు మాత్రమే అందేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఇందులో భాగంగా నిజమైన లబ్ధిదారులకు మేలు జరిగేలా వ్యవసాయాన్ని ఆధునీకరించేందుకు యూనిక్ కార్డును జారీ చేస్తున్నాయి. ఈ కార్యక్రమాన్ని ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట జిల్లాలో చేపడుతున్నారు.

- రైతన్నల సంక్షేమం కోసం..
- 14 అంకెలతో ప్రత్యేక కార్డు జారీ
- పథకాలు, ప్రోత్సాహాల లబ్ధికి కీలకం
- పట్టా భూములకే ప్రయోజనం
- ఆందోళనలో పేదరైతాంగం



కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభు త్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి మరింత చేరువ చేయడానికి ఆధార్ తరహాలో ప్రత్యేక కార్డులు జారీ చేస్తోంది. ఇది కేంద్రంలోని వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయశాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం. ఆధార్ కార్డు తరహాలో ప్రతి రైతుకు ఒక యూనిక్ కోడ్ కార్డును జారీ చేస్తారు. ఇది రైతుకు గుర్తింపు కార్డుగా ఉప యోగపడుతుంది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే పేర్లు నమోదు చేపట్టడం ప్రారంభించారు. ఈ ఏడాది మార్చి చివరి నాటికి దేశ వ్యాప్తంగా సుమారు ఐదు కోట్ల మంది రైతులకు భూఆధార్ కార్డులు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.

జిల్లాలో మొత్తం 2,40,672 మంది రైతులు ఉండగా ఇప్పటి వరకు 97,646 మంది రైతుల వివరాలు నమోదు చేశారు. ఇంకా 1,43,026 మందికి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. ఈ నమోదు కొనసాగుతూనే ఉంది. ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు అవుతున్న పథకాలు, రాయితీలు పొందాలంటే ఫార్మరీ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోరుతున్నాయి. సొంతభూమి ఉన్న రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి. పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ జిరాక్స్, ఆధార్ నెంబర్ లింక్ అయిన ఫోన్ నెంబర్ ఉన్న ఫోన్ తీసు కెళ్లాలి. రైతు సమక్షంలోనే రైతు సేవా కేంద్ర సిబ్బంది నిర్దిష్ట పోర్టల్‌లో రైతు భూమి వివరాలు ఆధార్‌కార్డు ఫంక్షన్ నెంబర్ నమోదు చేస్తారు. నమోదు పూర్తికాగా నే రైతు మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని రైతు సేవ కేంద్రం సిబ్బందికి తెలియజేస్తే నమోదు ప్రక్రియ పూర్తయి రైతు లకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించడం జరుగుతుంది.

### యూనిక్‌కార్డుతో లాభాలు

ప్రస్తుతం జారీ చేస్తున్న యూనిక్ కార్డుతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. రాయితీలు, అనేక సంక్షేమ పథకాలు ఈ కార్డు ద్వారా అందజే స్తారని వివరిస్తున్నారు. పీఎం కిసాన్ యోజన, అన్నదాత సుఖీ భవ, పంటల బీమా, వ్యవసాయ పరికరాల రాయితీలు, పంట పెట్టుబడి, ఎరువుల రాయితీలు, కనీస మద్దతు ధర పంట రుణా లు పొందే ప్రక్రియను ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య మరింత సులభ తరం చేయనుందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటు న్నారు. మరి కొంతకాలం తర్వాత ఉద్యాన రైతులు వివరాలను కూడా సేకరించి అవకాశాలు ఉన్నాయి. భవిష్యత్తులో కౌలు రైతులు, భూమిలేని వ్యవసాయ కూలీలు, వ్యవసాయ అనుబంధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారి వివరాలను కూడా సేకరించే అవకాశం ఉన్నట్లు అధికారిక వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

సొంత భూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం తమకు సంబంధించిన రైతుసేవ కేంద్రంలో వివరాలను నమోదు చేయించుకోవాలి. భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి చేకూరే లబ్ధి ఈ సంఖ్య ఉంటేనే అమలయ్యే పరిస్థితి ఉంటుంది.

- నరసింహారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయశాఖ

### పట్టా భూములకేనా... ప్రయోజనం

ప్రస్తుత వ్యవసాయశాఖ చేపడుతున్న విశిష్ట గుర్తింపు సంఖ్య సొంత భూముల రైతులకే కేటాయిస్తుండడంపై మిగిలిన రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది.

గత కొన్ని దశాబ్దాలుగా ప్రభు త్వాలు పంపిణీ చేసిన డీకేటీ భూములకు సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం వెల్లడి కాకపోవడంతో పేద రైతాంగం నిరాశలో ఉన్నారు. సొంత భూమి ఉన్న రైతులకే పేర్ల నమోదు కార్డుల జారీకి సుదీర్ఘకాలం పట్టే అవకా శాలు కనిపి స్తున్నాయి. తమ వరకు వచ్చేటప్పటికి ఏ నిబంధనలతో నమోదు కార్యక్ర మాన్ని చేపడతారో అనే ఆందోళన వ్యక్తం అవుతోంది. అయితే రెవెన్యూశాఖ నుంచి ముందుగా వివరాలు సేకరించిన తర్వాతనే డీకేటీ భూములకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



రైతు సేవా కేంద్రంలో వివరాలను నమోదు చేస్తున్న దృశ్యం

## బాధితులకు సత్వరం న్యాయం చేయాలి



రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

రాజుపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఏదైనా సమస్యపై పోలీసుస్టేషనుకు బాధితులు వచ్చినప్పుడు తక్షణం స్పందించి న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. బుధవారం రాజుపాలెం పోలీసుస్టేషన్ను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి క్రైం వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్న సమస్య అయినా ఫిర్యాదు చేస్తే పెండింగు లేకుండా సత్వరం పరిష్కారం చేయాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కువగా రైతులకు పొలం గట్లు, భూసమస్యలుంటాయని, అవి ఎలాంటి పరిణామాలకైనా దారితీస్తాయని.. వాటిని కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించాలన్నారు. ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం తొండలదిన్నె గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో ఎస్పీ అశోక్‌కుమార్ తన స్నేహితుడు ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండడంతో.. అతని కోరిక మేరకు అక్కడికి వెళ్లి విద్యార్థులతో సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు డీఎస్పీ భావన, రూరల్ సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ కత్తి వెంకటరమణ పాల్గొన్నారు.



## 250 బస్తాల చౌక బియ్యం స్వాధీనం



పట్టుబడ్డ బియ్యం బస్తాలతో సీఐ పురుషోత్తంరాజు

చెన్నూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో బియ్యం అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం 250 బస్తాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని తోళ్లగంగనపల్లె రోడ్డు సమీపంలో ఓ రేకులషెడ్డులో నిల్వ ఉంచిన 150 బస్తాలు, గోపవరం సమీపంలోని కేసీ ప్రధాన కాల్వ సమీపంలో నిల్వ ఉంచిన వంద బస్తాలను సీఐ పురు షోత్తంరాజు ఆధ్వర్యంలో పట్టుకుని బాబయ్య అనే వ్యక్తిని అరెస్టు చేశారు. పట్టుబడిన బియ్యాన్ని డీటీ ఆధ్వర్యంలో ఎంఎల్ఎస్ స్టాకు పాయింటుకు తరలించారు. పోలీసు సిబ్బంది పుష్పరాజు, శ్రీనివాసరాజు, ఆర్ఐ కౌశిక్, వీఆర్వో వెంకటుబ్బయ్య పాల్గొన్నారు.

## వన్యమృగాల వేటగాళ్లపై వేటు

- 14 రోజుల రిమాండ్

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వన్యమృగాలను వేటాడి వాటి మాంసపు విక్రయాల ద్వారా సొమ్ము చేసుకుంటున్న వేటగాళ్లపై అటవీఅధికారులు ఈనెల 10వ తేదీ దాడి చేసి పట్టుకున్నారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ప్రసాద్ అందించిన సమాచారం మేరకు వివరాలిలా.. చింతకొమ్మదిన్నె మండలం ఎగువసుగాలిబిడికి సమీపంలో ఉన్న రజనిగారి తోటలో కొంతమంది వ్యక్తులు దుప్పిని కోస్తున్నారనే సమాచారం అటవీశాఖ అధికారులకు అందింది. దీంతో డీఎఫ్ఓ ఆదేశాల మేరకు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ షకీల్ అహ్మద్, బీట్ ఆఫీసర్లు చౌడయ్య, నందిని, బాష తదితరులు దాడి చేసినట్లు వివరించారు. అటవీ సిబ్బంది దాడి చేసిన సమయంలో చింతకొమ్మదిన్నె మండలం కొలములపల్లెకి చెందిన పొట్టిపాటి రాజశేఖర్‌రెడ్డి, బుడుగు గంగయ్యతో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన ముదిరెడ్డి హరిలు దుప్పి మాంసం కోస్తూ దొరికినట్లు ఎఫ్ఆర్ఓ వివరించారు. దీనితో వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న నాలుగు కిలోల దుప్పి మాంసం, దుప్పి చర్మం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరు పర్చగా.. 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

## చికిత్స పొందుతూ టీడీపీ నేత మృతి



గంగిరెడ్డి (ఫైల్ ఫొటో)

పెండ్లిమర్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న టీడీపీ నేత, చీమల పెంట గ్రామానికి చెందిన మండ్లి గంగిరెడ్డి బుధవారం మృతి చెందాడు. ఈనెల 2వ తేదీ నందిమండలం గ్రామం నుంచి చీమలపెంటలోని తన ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## రావులపల్లి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

ఖాజీపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశాడని రావులపల్లి సర్పంచ్ పి.శివరామిరెడ్డి చెక్‌పవర్‌ను జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మి రద్దు చేసినట్లు ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. గతంలో సర్పంచ్ అభివృద్ధి చేయకపోయినా నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్తులు, వార్డు మెంబర్లు ఫిర్యాదు మేరకు విచారణ చేశారని, ఆ నిధులు దుర్వినియోగానికి సహకరించిన కార్యదర్శులు శ్రీనివాసులు, నారాయణరెడ్డిలకు షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు.

## ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యం సులభతరం

వేంపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ప్రణాళికాబద్ధంగా చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించడం సులభతరం అవుతుందని వైవీయూ ప్రొఫెసర్ డాక్టర్ కె.లలిత తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులనుద్దేశించి వ్యక్తిగత విద్యా సామర్థ్యాలను పెంపొందించుకోవడం అనే అంశంపై అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. మనిషి సంఘజీవిగా చేయాల్సిన పనులను ముందుగా ఆలోచించి వాటిని సాధించేందుకు నిరంతరం కష్టపడాలన్నారు. డైరెక్టర్ గుప్త, ఏఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయిలో నిలవాలి

- స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్




మాట్లాడుతున్న స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్

కడప ఎడ్యుకేషన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్య పరిశోధన ప్రమాణాలకు నెలవైన యోగివేమన విశ్వవిద్యాలయంలో చదివిన విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని రాజంపేట స్పెషల్ జ్యుడిషల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ ఆకాంక్షించారు. బుధవారం వైవీయూ 19వ వ్యవస్థాపక, కళాశాల దినోత్సవం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలో అతిథుల జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ మాట్లాడుతూ సాధించాలనే తపన, సంకల్పబలం ఉన్నవారే విజేతల జాబితాలో నిలుస్తారన్నారు. ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకొని.. దాని సాధనకోసం నిరంతరం శ్రమించాలన్నారు. చరిత్రలో మీకో పేజీ ఉండేలా మీ ప్రణాళికలు ఉండాలన్నారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్య పరిశోధనలో విశ్వవిద్యాలయం అద్భుతమైన ప్రగతిని సాధించిందన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడారు. అనంతరం వైవీయూ ఉపకులపతి ఆచార్య పి.ప్రకాష్ బాబు పంపిన సందేశాన్ని చదవి వినిపించారు. అనంతరం ఆచార్య విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## 13 జిల్లాల్లో అగ్నివీర్ నియామకాలకు నోటిఫికేషన్

గుంటూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 2025-26 సంవత్సరానికి 13 జిల్లాల్లో అగ్నివీర్ నియామకాలకు నోటిఫికేషన్ వెలువడిందని ఆర్మీ రిక్రూటింగ్ గుంటూరు బ్రాంచ్ కార్యాలయం డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ తెలిపారు. గుంటూరు, కర్నూలు, నెల్లూరు, అనంతపురం, కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఆసక్తిగల అభ్యర్థులు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, కార్యాలయ సహాయకులు/స్టోర్ కీపర్ టెక్నికల్, వృత్తి నిపుణుల పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగుతుందని తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జేవోఐఎన్ఐఎన్‌డీఐఎన్ఏఆర్ఎంవై.ఎన్ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 10లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక అభ్యర్థి రెండు వేర్వేరు అగ్నివీర్ విభాగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని.. ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష(సీఈఈ) తొలిసారిగా తెలుగు సహా 13 వేర్వేరు భాషల్లో జరుగుతుందని వెల్లడించారు. అన్ని కేటిగిరీలకు ఎన్‌సీసీ ఏ,బీ,సీ సర్టిఫికెట్ కలిగిన, ప్రతిభావంతులైన క్రీడాకారులు, టెక్నికల్ కేటిగిరీ పోస్టుల కోసం ఐటీఐ/డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు ఇస్తారని తెలిపారు.

## ఏఎఫ్‌ఏయూలో 1,3 సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదలచేస్తున్న వీసీ విశ్వనాథ్‌కుమార్

కడప ఎడ్యుకేషన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనవర్సిటీలో బుధవారం ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించి 1,3 సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ ప్రొఫెసర్ జి.విశ్వనాథ్‌కుమార్, రిజిస్ట్రార్ రాజజేష్‌కుమార్ రెడ్డి విడుదల చేశారు. వారు మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో ఫలితాలు విడుదల చేసేందుకు కృషిచేసిన సిబ్బందిని అభినందించారు. అదనపు పరీక్షల నియంత్రణ అధికారి జి.ఫణీంద్ర రెడ్డి, సహాయ పరీక్షల నియంత్రణ అధికారి ఉదయ్‌ప్రకాష్‌రెడ్డి, నారపురెడ్డి, పీఆర్‌సెల్ అధికారి వి.శివకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

## బ్లడ్ బ్యాంకులు 30 శాతం రక్తం పేదలకు ఇవ్వాలి



రెడ్‌క్రాస్‌లో రిజిష్టర్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కడప కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్ర జ్యో తి): రక్తదాన శిబిరాలు ఎక్కువగా నిర్వహించి... బ్లడ్ బ్యాంకుల నుంచి 30 శాతం రక్తం పేదలకు అందజేయాలని లేకపోతే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు ఆదేశించారు. బుధవారం నగరంలోని బ్లడ్ బ్యాంకులను జిల్లా ఎయిడ్స్, లెప్రసీ అధికారి డాక్టర్ సగిలి రవిబాబుతో కలిసి రెడ్‌క్రాస్ సెంటర్‌తో పాటు బోగా పార్వతమ్మ బ్లడ్ బ్యాంకును తనిఖీ చేశారు. అక్కడున్న రిజిష్టర్లను పరిశీలించారు. రక్తం అవసరం ఉన్న వారి వద్ద ఎంత డబ్బు వసూలు చేస్తున్నారనే విషయాలను రోగులకు ఫోన్ చేసి ఆరా తీశారు. అలాగే రక్తదాత రికార్డు, క్యాంపు రిజిష్టర్స్ తదితరాలను పరిశీలించారు. ఏపీ సాక్స్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజరు ఆలీహైదర్, ఖాజా మొహిద్దీన్ పాల్గొన్నారు.

### ప్రజల భాగస్వామ్యంతోనే వ్యాధుల నివారణ

సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరమని డీఎం హెచ్‌వో డాక్టర్ నాగరాజు, స్టేట్ అబ్జ ర్వర్ పార్వతీశం అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో రాయలసీమ జిల్లాలకు సంబంధించిన సబ్ యూనిట్ మలేరియా అధికారులతో ఒక్క రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాలు మొక్కుబడిగా చేస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో మండలస్థాయి అధికారులతో మమే కమై పారిశుధ్య కార్యక్రమంపై చైతన్యం కల్పించాలన్నారు. జిల్లా మలేరియా అధికారిణి మనో రమ, డిప్యూటీ డైరెక్టర్ రామనాథం, కడప జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మీనాయక్, డాక్టర్ నాగసుధారాణి, డాక్టర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

## పొలతల ఆలయ శాశ్వత హుండీల ఆదాయం రూ.33,37,829

పెండ్లిమర్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పొలతల మల్లేశ్వరస్వామి ఆలయ శాశ్వత హుండీల ద్వారా రూ.33,37,829 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కృష్ణానాయక్ తెలిపారు. బంగారు 50 గ్రాములు, వెండి 4 కేజీలు వచ్చాయన్నారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవదాయ సూప రింటెంట్ రమణమ్మ, టీడీపీ నాయకులు శిరిగిరెడ్డి రాజారెడ్డి, ఆలయ పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బంది లేకుండా రీసర్వే చేపట్టాలి

చెన్నూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : భూముల రీసర్వే విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన ఆయన రీసర్వే విషయంపై తహసీల్దారు సరస్వతితో మాట్లాడారు. అంతేకాక రీసర్వేలో సకాలంలో రైతులు రాకపోతే వారికి నోటీసుల ద్వారా తెలియపరిచి మరో రెండు అవకాశాలు ఇవ్వాలన్నారు. కాగా సచివాలయంలోని సర్వేయర్లందరూ రీసర్వే విషయంలో మరింత జాగ్రత్త వహించాలని, రైతుల నుంచి ఎలాంటి వ్యతిరేకత లేకుండా చూడాలంటూ తహసీల్దారు సరస్వతి సర్వేయర్లకు సూచించారు.

## నగరంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

కడప మారుతీనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా వుండేలా కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని బీజేవైఎం జిల్లా కార్యదర్శి చాగలమర్రి ఓబులేసు కోరారు. బుధవారం స్థానిక ఎన్‌జీవో కాలనీలో గల బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా నగరంలో గల ముఖ్య కూడళ్ల లో కార్పొరేషన్ మెడికల్ విభాగం సారథ్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో బీజేవైఎం నాయకులు సురేంద్ర, మోహన్, ప్రవీణ్, నివేద్‌రాజ్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కళాజాత

చక్రాయపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల ప్రాంతమైన కల్లూరుపల్లె గ్రామంలో బుధవారం రాత్రి కడప ఎక్సైజ్ శాఖ జయరాజ్ అధ్యక్షతన నవోదయ 2.0 ప్రోగ్రాం కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, పులివెందుల సీఐ చెన్నారెడ్డి, కళాబృందం, ప్రజలుపాల్గొన్నారు.

### అరటి కాయల లారీ బోల్తా

పులివెందుల రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండు వారిపల్లె సమీపంలోని ఘాట్‌రోడ్డులో మంగళవారం సాయంత్రం అరటికాయల లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడింది. పులివెందుల నుంచి అరటి కాయలు లోడ్ చేసుకొని అనంతపురం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు, క్లీనర్‌కు స్వల్ప గాయాలు కాగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందినట్లు సమాచారం. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

### మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

సింహాద్రిపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఉచిత టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి ఓ ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు(బలిజ) కులాల మహిళకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తి అయిన తర్వాత కుట్టుమిషన్ ఇవ్వడం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు. ఈ నెల 22వ తేదీ లోపు సంబంధిత సచివాలయం లేదా ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 18 నుంచి 50 సంవత్సరాలు లోపు వయస్సు గల మహిళలు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తీసుకెళ్లాల్సి వుంటుందన్నారు.

### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కమలాపురం రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ ఎస్కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం రోడ్డు భద్రత నియమాలపై కమలాపురం పోలీసుస్టేషన్‌లో పట్టణ పరిధిలో ఉండే ఆటో డ్రైవర్లందరికీ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



## పిఠాపురం జనసేన ఆవిర్భావసభకు తరలిరండి

కడప మారుతీనగర్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం జనసేన ఆవిర్భావసభకు తరలిరావాలని జనసేన పార్టీ కడప సీనియర్ నాయకుడు జి.వి. రమణ అన్నారు. జిల్లా నుంచి జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు ఈనెల 14న నిర్వహించే కాకినాడ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆ మేరకు బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో హలో కడప...చలో పిఠాపురం పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. సభకు 50 వాహనాలు, 4 బస్సులు ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం కడప నుంచి పిఠాపురం బయలుదేరనున్నాయన్నారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు మాలే శివ, చలపతి, రామ్ సిద్ధు పాల్గొన్నారు.

## 'యువతకు పంగనామాలు పెట్టింది జగన్‌రెడ్డే'

కడప మారుతీనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు భర్తీచేస్తామని, మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని గత 2019లో అధికారంలోకి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి 5 సంవత్సరాల కాలంలో ఏ ఒక్కటీ చేయకుండా నిరుద్యోగ యువతకు పంగనామాలు పెట్టిన సంగతి తెలిసిందే అని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ ధ్వజమెత్తారు.బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరులు సమావేశంలో ఆయన ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేష్ తో కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు అక్షయ్‌కుమార్‌రెడ్డి, షరీఫ్, ఆసిఫ్ తదితరులున్నారు.

## జగనన్న కాలనీలో నీటి కష్టాలు

సీకేదిన్నె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో మంచినీటి కష్టాలు అధికంగా ఉన్నాయని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం మాచనపల్లి జగనన్న కాలనీని గురువారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదవారి సొంతింటి కళ దేవుడెరుగేమోకానీ జగనన్న కాలనీల్లో నివాసం ఉన్న పేద ప్రజలకు కన్నీటిని తాగి కాలం గడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యవర్గ సభ్యులు ప్రసాద్, రమేష్‌బాబు, విజయ్‌కుమార్, రవి, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

# భానుడి భగభగ...



నిర్మానుష్యంగా ఉన్న అంబేడ్కర్ సర్కిల్





వేసవి ప్రారంభంలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ భగభగ మండుతూ దాదాపు 40 డిగ్రీల సమీపంలో ఉష్ణోగ్రత కనిపిస్తోంది. భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఎండ తీవ్రతను తట్టుకునేం దుకు ప్రజలు అనేక ప్రయత్నాలు చేస్తూ గొడుగులు తదితరాలను ధరిస్తూ వేసవి సమయంలో బయటికి వస్తున్నారు. తట్టుకునేందుకు చల్లని పానీయాలతో పాటు కొబ్బరినీళ్ల, మజ్జిగ, ఫ్రూట్ జ్యూస్, కర్బూజ వంటి వాటితో తాత్కాలిక ఉపశమనం పొందుతున్నారు. వీలైనంత వరకు ఎండ సమయంలో బయటికి రాకుండా ఉండాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి)

## నారసింహ నామంతో ప్రత్యేక పూజలు



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న పుత్తా కుటుంబ సభ్యులు

వల్లూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నారాయణ.. నరసింహ అంటూ వేదమంత్రాలు వల్లిస్తుండగా పుత్తా నరసింహారెడ్డి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే క్రిష్ణ చైతన్యరెడ్డి దంపతులు శ్రీలక్ష్మి నారసింహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజున సుగంధ ద్రవ్యాలతో నారసింహస్వామికి ప్రత్యేకంగా అభిషేకించారు. అనంతరం లఘు పూర్ణాహుతితో ఉదయం కార్యక్రమాలు ముగిశాయి. అలాగే రాత్రి 9గంటలకు రంగస్థల పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లోమాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ, కుమారుడు ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, భార్య చైతన్యరెడ్డి, పుత్తా సోదరుడు రామచంద్రారెడ్డి, భార్యవెంకటసుబ్బమ్మ, యువ నాయకుడు సాయినరసింహారెడ్డి పాల్గొన్నారు.

## తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

వేంపల్లె,మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం, తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని సస్పెండ్ అయిన ఈఓ స్థానంలో కొత్త ఈఓను వెంటనే నియమించాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి కోరినట్లు టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీటెక్ రవి ద్వారా కలెక్టర్‌ను కలిసి వేంపల్లెకు ఈఓను నియమించాలని కోరినట్లు తెలిపారు. మండల పరిశీలకుడు మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ బాలస్వామిరెడ్డి, రైతు విభాగ రాష్ట్ర నాయకులు జగన్నాథరెడ్డి, శేషారెడ్డి, యువనాయకులు వేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మండల పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా హరికిశోర్

లింగాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామపంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా హరికిశోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల పంచాయతీ కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలలో అధ్యక్షుడిగా వై.హరికిశోర్, ఉపాధ్యక్షుడిగా పృథ్వీనటరాజ్, కార్యదర్శిగా వి.వరలక్ష్మీదేవి, కోశాధికారిగా సల్మా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం తమ సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు.

## మొల్ల ఆనవాళ్లను పరిరక్షించాలి

కడప కల్చరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కాలగర్భంలో కలిసిపోతున్న మొల్ల ఆనవాళ్ళను పరిరక్షించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని మహాకవయిత్రి మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు కోరారు. మొల్ల జయంతి ఉత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ప్రత్యేక సభా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ ప్రతినిధులు రాయుడు, చలపతిగౌడ్, సుభ్‌హాన్, పుల్లయ్య, పెండ్లిమర్రి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేటి విద్యార్థులే రేపటి పౌరులు

చక్రాయపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులే రేపటి పౌరులని మండల విద్యాశాఖాధికారి-2 వెంకట రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మహదేవపల్లె జడ్పీ హైస్కూల్, చక్రాయపేట జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి వీడ్కోలు సమావేశం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా 10వ తరగతి హాల్ టికెట్లను సరస్వతి చిత్రపటం వద్ద పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామాంజులు, రవికుమార్ పాల్గొన్నారు.

## వాటర్ కూలర్ వితరణ



లింగాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు పూర్వపు విద్యార్థులు చేయూతనందించారని లింగాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అన్నారు. 1997-98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.16వేలు విలువైన వాటర్ కూలర్‌ను బుధవారం వితరణగా అందించారు.ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థులు అండగా నిలవాలని, నిరుపేద విద్యార్థులకు చేయూతనందించాలని కోరారు.

## పరిశుభ్రతపై శిక్షణ

వల్లూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రపై పరిశుభ్రతపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని వల్లూరులో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ సెంటరులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా స్వచ్ఛాంధ్ర డిస్ట్రిక్ట్ కోఆర్డినేటరు సుజాత శిక్షణ ప్రారంభించారు. ముఖ్యంగా గ్రామీణప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ వీధుల్లో పరిశుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలని శిక్షణ తరగతులు ప్రారంభించామని అన్నారు. ముఖ్యంగా ప్రతి ఇంటికి తడి, పొడి చెత్త బుట్టలు అందించామని, చెత్తను ఆ బుట్టల్లోనే వేయాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో రఘురాం, స్వచ్ఛభారత్ నాగలక్ష్మి, శ్రీధర్, కమలాపురం, వీఎన్‌పల్లె, ఎంపీడీవోలు జ్యోతి, చంద్రమౌళీశ్వర,ఈవోపీఆర్‌డిలు సుజియా, రహ్మతుల్లా, కరీముల్లా,వల్లూరు, కమలాపురం, వీఎన్‌పల్లె గ్రామాలకు చెందిన కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు,కార్యదర్శి శ్రీనివాసులు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జున హైస్కూల్‌లో ఘనంగా ఫేర్‌వెల్ డే




సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు

కడప ఎడ్యుకేషన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో బుధవారం ఘనంగా ఫేర్‌వెల్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కె.శివతులశమ్మ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ప్రవర్తించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ కె.శివప్రసాద్‌రెడ్డి, హెడ్‌మిస్ సుశీల, ఉపాధ్యాయులు, పిల్లలుపాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు

కడప (క్రైం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలోజిల్లాలోని విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగే లా పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం కడప నగరంలోని నిర్మల నర్సింగ్ స్కూలు విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, డయల్ 100, రహదారి భద్రత, సోషల్ మీడియా సైబర్ నేరాల పట్ల తీసుకోవాలసిన జాగ్రత్తలను యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ ఈదురుబాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సంపద సృష్టి, సనాతన ధర్మమంటే ఆశ్రమాలను కూల్చివేయడమా : తులసిరెడ్డి

వేంపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బాబు సంపద సృష్టి, పవన్‌కళ్యాణ్ సనాతన ధర్మం, బీజేపీ నాయకులు హిందూ ధర్మపరిక్షణ అంటే ఆధ్యాత్మిక ఆశ్రమాలను కూల్చివేయడమా అంటూ కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కాశినాయన మండలం జ్యోతిక్షేత్రంలో ఉన్న కాశిరెడ్డినాయన ఆలయానికి సంబంధించిన విశ్రాంతి, స్నానపుగదులు, గోశాల, క్షవరశాలలను ఇటీవల అటవీ, పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు కూల్చివేయడం దురదృష్టకరమన్నారు. 1995లో ప్రారంభమైన కాశినాయన క్షేత్రం వందలమది భక్తులకు నిత్యాన్నదానం చేస్తున్నారని, అక్కడ ప్రభుత్వ నిధులతో విద్యుత్, నీరు, బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పడ్డాయని, అలాంటి పాత చరిత్ర కలిగిన ఆశ్రమాన్ని కూల్చివేయడం, ప్రభుత్వం చోద్యం చూడడం శోచనీయమన్నారు. వెంటనే కూల్చివేతలను ఆపివేసి అటవీ అనుమతులు తెప్పించి కూల్చివేసిన కట్టడాలను పునరుద్ధరించి, కాశినాయన క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.



# 3,4,5 తరగతుల విలీనం ఆపాలి



చింతకొమ్మదిన్నె... శివాజీనగర్ పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

చెన్నూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 3, 4, 5 తరగతుల విలీనాన్ని ఆపాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. బుధవారం చెన్నూరు క్లస్టర్ కాంప్లెక్స్‌లో యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు లక్ష్మీరాజా మాట్లాడుతూ ప్రైమరీ స్కూల్స్‌కు ఐదు కిలోమీటర్ల దూరం పరిధిల ఉన్న అన్ని ప్రాథమిక పాఠశాల్లో 3, 4, 5 తరగతులను మోడల్ ప్రైమరీ స్కూలులో విలీనం చేయడానికి వేగంగా అడుగులు వేయడం దారుణమన్నారు. ఈ విధానం వల్ల ప్రాథమిక విద్యావ్యవస్థ దెబ్బతింటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకుల వెంకటసుబ్బయ్య, బాబురెడ్డి, గురు నారా యణ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు

**సీకేదిన్నె..:** తమ పిల్లలను మూడు కిలోమీటర్ల దూరంలోని పాఠశాలకు తరలించవద్దని గ్రామస్థులు నిరసన తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం శివాజీనగర్‌కు చెందిన ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను మూడు కిలోమీటర్ల దూరంలోని ఎర్రమాచుపల్లి పాఠశాలకు తరలించడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పర్తి పంచాయతీ టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**విలీన ప్రక్రియ అసంబద్ధమైన విధానాలు విడనాడాలి..:** ప్రభుత్వ పాఠశాలల పునర్విభజన ప్రక్రియలో భాగంగా 3, 4, 5 తరగతుల విలీన ప్రక్రియను అసంబద్ధమైన పద్ధతిలో చేపట్టడాన్ని విడనాడాలని ఎస్టీయూ కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాష, సంగమేశ్వరరెడ్డి కోరారు. చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలో జడ్పీ ఉన్నత పాఠశాల అంగడి వీధి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం కాంప్లెక్స్ సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ చెన్నకేశవరెడ్డి, మండల ఎస్టీయూ నాయకులు ఓబులేసు, రమేష్, పీఆర్‌టీయూ గజ్జెల తిరుపాల్, యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేటి నుంచి అంకాలమ్మ బ్రహ్మోత్సవాలు



బి.కోడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మున్నెల్లి గ్రామ సమీపంలో సగిలేటి ఒడ్డున వెలసిన అంకాలమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమై 16న ముగుస్తాయి. 13న గురువారం సాగు అభిషేకం, ఆకుపూజ, ధ్వజారోహణ, 14న రాత్రి తిరునాళ్ల ఘనంగా నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి చలిపిండి నానబాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు 16 గ్రామాల నుంచి నూనె డబ్బాలు, కోలాటాలతో అత్యంత వైభవంగా ప్రజలు పాల్గొంటారు. 15న శనివారం పగలు తిరునాళ్ల రోజున బిమఠం మండలం కేశాపురం గ్రామవాసులు భారీ సెట్టింగులతో కుంకుమ బండి, అదే రోజు బండలాగుడు పోటీలు, కులుకుభజన నిర్వహిస్తారు. నాలుగు గ్రామాల నుంచి శిరిమాను బండ్లు పాల్గొంటాయి. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆలయ ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. విచ్చేసిన భక్తులకు మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించనున్నారు.

## ప్రభుత్వాఫీసులకు స్థలం కేటాయించాలి

కొండాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొండాపురం గ్రామంలో ప్రభుత్వాఫీసులకు స్థలం కేటాయించాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు తహసీల్దార్ గురప్పను కోరారు. కొండాపురం సచివాలయంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురైన ప్రభుత్వాఫీసులు, అలాగే రామాలయం, చర్చి తదితర గుళ్లకు స్థలాన్ని కేటాయించి వెంటనే నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మనోహర్‌బాబు, వెంకటరమణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

● వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి

జమ్మలమడుగు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే నేల ఆరోగ్యం సుస్థిరమని వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేయడానికి విత్తన గుళికలు తయారు చేయడం తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్యాలయ సిబ్బంది, వీపీఏలు రాణి, ప్రతాప్, విజయ్, జయరామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## 'రాచమల్లు.. అసత్య ఆరోపణలు మానుకో'



ప్రొద్దుటూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వరద రాజులరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని టీడీపీ నాయకుడు పగిడాల దస్తగిరి, రిటైర్డ్ ఎస్‌ఐ శంకర్‌లు హితవు పలికారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ బీసీ రుణాలన్ని ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి సిఫారసు చేసిన వారికే ఇచ్చారని రాచమల్లు ఆరోపించడం సరికాదన్నారు. రిటైర్డ్ ఎస్‌ఐ శంకర్ మాట్లాడుతూ టీడీపీలో అసాంఘిక నేరాల్లో పాల్గొనే వారికి తావులేదన్నారు. ఇప్పటికైనా రాచమల్లు తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

## మాలమహానాడు మండలాధ్యక్షుడిగా విజయరావు

బి.కోడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు మండలాధ్యక్షునిగా చాటకొండు విజయరావును నియమించినట్లు రాష్ట్ర మానవ హక్కుల బద్వేలు ఏరియా అధ్యక్షుడు ముత్యాల ప్రసాదరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన నియామకపత్రం అందజేసినట్లు తెలిపారు. మండలంలో మాలలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా తాను అండగా ఉంటానన్నారు.



## ప్రజలు పోలీసులకు సహకరించాలి: డీఎస్పీ



ప్రొద్దుటూరు డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారని, వీటిని నివారించేందుకు ప్రొద్దుటూరు ప్రజలు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ భావన విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇల్లు వదిలి వేరే వూర్లకు అవసరాల నిమిత్తం వెళ్లే వారు సాధ్యమైనంత వరకు నగదు, బంగారు, వెండి ఆభరణాలు ఇళ్లలో పెట్టకుండా బ్యాంకు లాకర్లలో పెట్టుకొని వెళ్లాలన్నారు. అత్యవసరంగా వెళ్లాల్సి వస్తే సంబంధిత పోలీసుస్టేషన్‌లో, కమాండ్ కంట్రోల్‌లో గానీ తెలిపితే ఎల్‌హెచ్ ఎంఎస్ కెమెరాలు అమర్చుతామన్నారు. మీ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనపడితే వెంటనే 100 నెంబరుకు ఫోన్‌చేసి తెలపాలన్నారు. గేటెడ్ కమ్యూనిటీలో వుండే వారు గేటు వద్దే ఎవరు వస్తున్నారు.. వెళ్తున్నారేది రిజిష్టరు చేసుకోవాలన్నారు. ఫోన్ నెంబరు, ఇతర వివరాలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు అమర్చుకోలన్నారు. ప్రజలు విలువైన వస్తువుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటే, దొంగతనాల నివారణకు తమ వంతు సహకరించినట్లు ఉంటుందని ఆమె కోరారు.

## ఆశ్రమాన్ని కూల్చడంలో ఆంతర్యమేమిటి ..?

● బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయాదవ్



నిర్మాణాలను పరిశీలిస్తున్న రామచంద్రయాదవ్

కాశినాయన, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గత 30 ఏళ్లుగా ఆధ్యాత్మిక కేంద్రంగా లక్షలాది మందికి అన్నదానం చేస్తూ వేలాది మంది నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న జ్యోతిలోని కాశినాయన ఆశ్రమాన్ని కూలగొట్టడంలో గల ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని భారత చైతన్య యువజన(బీసీవై) పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. ఇటీవల జ్యోతిక్షేత్రంలో అటవీఅధికారులు అనుమతులు లేవంటూ నిర్మాణాలను కూల్చడంపై తెలుసుకున్న ఆయన బుధవారం జ్యోతిక్షేత్రాన్ని సందర్శించారు. కాశినాయన, లక్ష్మీనరసింహ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కూలగొట్టిన కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మాని కాపాడుతానంటూ ప్రచారం చేస్తున్న కూటమి ప్రభుత్వంలోని ఉప ముఖ్యమంత్రికి కాశినాయన ఆశ్రమంలోని కట్టడాల కూల్చివేత తెలియలేదా అన్నారు. ఒక వైపు ప్రభుత్వంలోని అటవీశాఖ అధికారులే కట్టడాలను కూల్చుతుంటే మరో వైపు ఐటీ, విద్యాశాఖ శాఖ మంత్రి లోకేష్ తమకు తెలికుండానే అధికారులు కూల్చారని తన సొంత డబ్బుతో తిరిగి నిర్మిస్తానని ట్వీట్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎవరిని మభ్యపెట్టడానికి ఇలాంటి ప్రచారాలు చేస్తున్నారో ప్రజలకు తెలుసన్నారు. కాశినాయన ఆశ్రమానికి కల్గిన ఇబ్బందులను కేంద్ర ప్రభుత్వ పెద్దలు, సంబంధిత అటవీశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మురళీకృష్ణ యాదవ్, నరసింహయాదవ్, శ్రీనివాసయాదవ్, ఏపీ యాదవ సంఘం యూత్ సెక్రటరీ వినోద్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## పశువైద్య విద్యార్థులది న్యాయమైన డిమాండ్

● మాజీ ఎమ్మెల్సీ గేయానంద్



విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రొద్దుటూరురూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పశువైద్య విద్యార్థులు అడుగుతున్నది న్యాయమైన కోర్కెనని ప్రభుత్వం ఆలోచించి జీవోను విడుదల చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గోపవరం పంచాయతీలోని పశువైద్యశాలలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న జూనియర్ డాక్టర్లతో కలిసి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 38 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రైతులను, ప్రజా సంఘాలను, విద్యార్థి సంఘాలను, కుల సంఘాలను కలుపుకుని పోరాటాన్ని ఉధృతం చేయాలన్నారు. పశువైద్య కళాశాల విద్యార్థుల స్టైఫండ్ విషయంలో ఫైనాన్స్ మినిస్టర్ పయ్యావుల కేశవులతో మాట్లాడుతానని విద్యార్థులకు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జేవీవీ రాష్ట్ర సమత నాయకులు ప్రసన్న, సీపీఎం పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాద్, పశువైద్య కళాశాల అధ్యక్షుడు సుబ్బారావు, ఉపాధ్యక్షులు సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు ఇంటి స్థలం కేటాయించాలి

బద్వేలు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వికలాంగులకు ఇంటి స్థలంతో పాటు 3 ఎకరాల సాగుభూమి ఇవ్వాలని వికలాంగుల ఇళ్ల స్థలాల సాధన సమితి అధ్యక్ష, కార్యదర్శులు రమణ, కదిరుల్లాలు కోరారు. బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఇంటి స్థలాల సాధనకై వికలాంగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళి, వెంకటసుబ్బయ్య, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## నాటుసారాను నిర్మూలిద్దాం : సీఐ

మైదుకూరురూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నాటుసారా నిర్మూలనలో భాగంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని మండలంలోని ముద్దిరెడ్డిపల్లె తాండాలో బుధవారం ఎక్సైజ్ సీఐ ధీరజ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాటుసారా తాగితే వచ్చే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్ర, రాజసింహ పాల్గొన్నారు.

## నేడు మార్కెట్ వేలం

మైదుకూరురూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు మున్సిపాలిటీ 2025-26కు సంబంధించి బస్టాండ్ గేటు, దినసరి కూరగాయల మార్కెట్ గేటుకు వేలంపాటను గురువారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసులరెడ్డి సమక్షంలో ఉదయం 11కు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలి

ముద్దనూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి నుంచి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని శ్రద్ధగా చదువుకోవాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం పదోతరగతి విద్యార్థినులకు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు మాట్లాడుతూ పదవ తరగతిలో విద్యార్థినులు చక్కగా పరీక్షలు రాసి, ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

## స్టాక్‌ను పరిశీలించిన విజిలెన్సు అధికారి



గొడౌన్‌లో స్టీల్‌ను తనిఖీ చేస్తున్న హౌసింగ్ విజిలెన్సు అధికారి

ప్రొద్దుటూరు,మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని హౌసింగ్ డిపార్ట్‌మెంటుకు చెందిన గొడౌన్లలో సిమెంటు, స్టీలు స్టాకును హౌసింగ్ డిపార్ట్‌మెంట్ విజిలెన్సు విభాగం డీఈ చంద్రశేఖర్‌రాజు పరిశీలించారు. బుధవారం స్థానిక మార్కెట్‌యార్డు, పాలకేంద్రాల్లోని హౌసింగ్ గొడౌన్లను ఆయన తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించా రు. మార్కెట్‌యార్డులో 196 టన్నుల స్టీలు, 2900 సిమెంటు బస్తాలు వున్నట్లు గుర్తించారు. పాలకేంద్రం వద్ద గొడౌన్‌లో 1080 సిమెంటు బస్తాలు వున్నట్లు గుర్తించారు. ప్రొద్దుటూరుతో పాటు కడప, మైదకూరు, కమలాపురం గొడౌన్లను కూడా తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో హౌసింగ్ అర్బన్ రూరల్ డీఈలు గురుప్రసాద్, వెంకటసుబ్బయ్య, ఏఈలు రవి, సుబ్రమణ్యంలు వున్నారు.

## డ్రగ్స్ రహిత సమాజానికి పాటుపడాలి

బద్వేలు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నివారణకై ప్రతిఒక్కరూ పాటుపడి డ్రగ్స్ రహిత సమాజం నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. యువత ఎలాంటి చెడవు వ్యసనాలకు బానిస కారాదని, గంజాయి మత్తు పదార్థాలు వంటి వాటి జోలికి వెళ్లొద్దన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, ఆదిల్‌బాష, పట్టణ నాయకులు రామకృష్ణ, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

జమ్మలమడుగు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు జెండా ఆవిష్కరణ చేశారు. ముందుగా కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం జమ్మలమడుగు వైసీపీ కార్యాలయం వద్ద నుంచి యువత పోరుబాట కార్యక్రమానికి సుమారు 20 వాహనాలకు పైగా తరలివెళ్లారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఉప్పలపాడు శ్రీనివాసులరెడ్డి, పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, గజ్జెల లక్షుమయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే జమ్మలమడుగులో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు వైసీపీ నాయకులు దూదేకుల కుళాయప్ప, కుళాయిబాష ఆధ్వర్యంలో నిర్వహించారు. గాయత్రి వృద్ధాశ్రమం తదితరచోట్ల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అబ్దుల్‌ఖాదర్, సుధాకర్, అన్సర్, సుభహాన్, తదితరులు పాల్గొన్నారు.

**ముద్దనూరు:** స్థానిక వైసీపీ కార్యాలయం వద్ద బుధవారం వైసీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. వైసీపీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో రవికుమార్, చెన్నకేశవరెడ్డి, తిరుమలరెడ్డి, సిద్దు, నవీన్, రమేష్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల వీడ్కోలు సమావేశం

గోపవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హైమావతమ్మ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న దాతలు, పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రసంగించారు. కార్యక్రమంలో దాతలు దిలీప్‌కుమార్, నరసింహారెడ్డి, రాధాక్రిష్ణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమణయ్య, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పాఠశాలకు రూ.50 వేల వితరణ



హెచ్‌ఎంకు నగదు వితరణ చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, మార్చి 12(ఆంధ్ర జ్యోతి): ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తమ ఉదారత్వాన్ని చాటు కు న్నారు. పాఠశాల ముందు భాగాన మరమ్మతులు చేసిన ప్రహరీకి రంగులు, దేశనాయకుల చిత్రాలను వేసేందుకు 2002-23 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు రూ.50 వేలు వితరణగా చేశారు. నగదును హెచ్‌ఎం, ఎంఈవో రామాంజనేయరెడ్డికి అందజేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి, జీవితంలో స్థిరపడేందుకు కారణమైన పాఠశాలను ఎప్పటికీ మరువమన్నారు. ప్రహరీ నిర్మాణానికి హనుమారెడ్డి 20 మూటల సిమెంటును కూడా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుభాస్కర్‌రెడ్డి, తుపాకుల చంద్ర ఓబుళరెడ్డి, పూర్వ విద్యార్థులు వెంకటనారాయణ, హనుమారెడ్డి, నవీన్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి, గఫార్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

## సింహవాహనంపై శ్రీనివాసుడు



బద్వేలురూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపాలెంలో వెలసిన లక్ష్మీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సింహవాహనంపై వెంకటేశ్వరస్వామి గ్రామ పుర వీధుల్లో ఊరేగారు. ఈ కార్యక్రమానికి పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## భూములపై విచారణ చేపట్టాలి : సీపీఐ

బి.కోడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బద్వేలు - పోరుమామిళ్ల ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న భూములను స్థానికేతరులకు అక్రమంగా ఆన్‌లైన్ చేసిన ఫ్రీ హోల్డ్ భూములపై తక్షణమే విచారణ చేపట్టి అర్హులకు పంపిణీ చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు తహసీల్దారు దస్తగిరియ్యకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు సంగటి చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ భూముల్లో పాతిన రెవెన్యూ హెచ్చరిక బోర్డులు నేడు మాయమయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ నాయకులు చంద్రమోహన్‌రాజు, జకరయ్య, నారాయణ, తదితరులు పాల్గొన్నారు

## నూతన కార్యవర్గం ఎన్నిక



కమిటీ సభ్యుల పత్రాన్ని ఎంపీడీవోకు అందజేస్తున్న కార్యదర్శులు

ప్రొద్దుటూరురూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్ అసోసియేషన్ ఆదేశానుసారం మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు (గ్రేడ్-1-6)ల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కార్యదర్శుల కార్యనిర్వాహక సంఘం అధ్యక్షుడిగా కె.రామక్రిష్ణ, ఉపాధ్యక్షుడిగా డి.మస్తాన్, మహిళా ఉపాధ్యక్షురాలు డి.శిరీష, కోశాధికారి డి.జశ్వంత్‌రెడ్డి, జనరల్ సెక్రటరి ఐ.సుబాషిణి, అదనపు సెక్రటరి కిరణ్‌కుమార్‌రెడ్డి, గౌరవ సలహాదారులు సాంబశివారెడ్డి, రామమోహన్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులు భాగ్యలక్ష్మి, ఈశ్వరమ్మ, రాజేంద్రప్రసాద్, ధనుంజయబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తదనంతరం నూతన కమిటీ పత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు.

## లోకేష్ కృషి అభినందనీయం: రితీశ్‌రెడ్డి

బద్వేలుటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాశినాయన క్షేత్రాన్ని తన సొంత ఖర్చులతో అభివృద్ధికి పాటుపడతానని మంత్రి నారా లోకేష్ హామీ ఇవ్వడం అభినందనీయమని నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీశాఖ నిబంధనల పేరుతో నియోజకవర్గంలోని కాశినాయన క్షేత్రంలో అన్నదాన సత్రాన్ని కూల్చివేతలపై లోకేష్ దృష్టిపెట్టి భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఉండేందుకు కృషిచేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇప్పటికే ప్రభుత్వం తరపున కొంతమంది క్షేత్రాన్ని పరిశీలించాలన్నారు. అలాగే కాశినాయన క్షేత్రానికి ఆర్టీసీ బస్సులను నడిపేందుకు అధికారులతో మాట్లాడి భక్తుల మనోభావాలను గౌరవించారని తెలిపారు.

## మౌలిక వసతులు కల్పించాలి

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అమృతానగర్‌లో ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలకు మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు గంగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అమృతానగర్‌లో 2,200 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారని, కానీ మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అమృతానగర్ వాసులకు రోడ్లు, మంచినీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శేఖర్, వెంకటేష్, స్థలాల లబ్ధిదారులు ప్రభాకర్, పెంచలయ్య, పార్వతి, హసీనా, గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను అమలు చేయాలి

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈ నెల 14న నిరుద్యోగ సదస్సు నిర్వహిస్తున్నట్లు డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ పేర్కొన్నారు. సీపీఎం కార్యాలయంలో బుధవారం నిరుద్యోగ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, సీపీఎం నాయకులు సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## 16న మాజీ సైనికుల ర్యాలీ

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సంక్షేమం కోసం ఈ నెల 16న ఆదివారం కడప జడ్పీ సమావేశ మందిరంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డిఫెన్స్ ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షుడు ఎన్.బాలవీరారెడ్డి పేర్కొన్నారు. ఈ ర్యాలీలో పాల్గొనే మాజీ సైనికుల కోసం 16న ఉదయం 6.30 గంటలకు పాతబస్టాండులో బస్సులు ఏర్పాటు చేశామన్నారు. మాజీ సైనికులు, వీరనారీమణులు ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

## 15న జమాల్‌వల్లి ఉరుసు

దువ్వూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణంపల్లిలో జమాల్‌వల్లి ఈ నెల 15న ఉరుసు మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం గంధం, శనివారం ఉరుసు ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా శనివారం సేద్యపు ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గెలుపొందిన ఎద్లకు బహుమతులుగా ఇవ్వనున్నట్లు వివరించారు.